క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఆలయ సహాయ కమీషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నిత్య అన్నదాన భవనానికి 80 లీటర్ల కెపాసిటీ గల వాటర్ కూలర్‌ను గుంటూరుకు చెందిన టి.నాగేశ్వరరావు తన భార్య విజయలక్ష్మి జ్ఞాపకార్థం శుక్రవారం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చక స్వామి పాత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదాన భవనం నందు కూలర్‌ను దాతలతో కలిసి ఏసీ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఫిబ్రవరి కూలి వెంటనే చెల్లించాలి



రేటూరు(కాకుమాను): ఉపాధి హామీ కూలీలకు ఫిబ్రవరి నెల నగదును వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేటూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన సందర్శించారు. రోజు రోజుకు మండుతున్న ఎండలను కూడా లెక్కచేయకుండా కూలీలు పనులకు వస్తున్నారని అన్నారు. అయినా.. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి నెల కూలి నగదు నేటికీ విడుదల చేయకపోవడం కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. పని ప్రదేశాల్లో కనీసం తాగునీటిని కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం నగదును కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం నాయకుడు జగన్ తదితరులు ఉన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

పెదకాకాని: ప్రభుత్వ పథకాలు అమలులో వలంటీర్ల పాత్ర ప్రశంసనీయమని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. తక్కెళ్ళపాడు గ్రామంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. గ్రామంలో 39 మంది వలంటీర్లు ఉండగా వారిలో పెనుమాల ప్రత్యూషకు సేవారత్న అవార్డు, మిగిలిన 38 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, ఈఓపీఆర్డీ పి.రామాంజనేయులు, సర్పంచి కూచిపూడి రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యులు కొమ్మూరి మహేష్, కట్టా రాధారాణి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, వార్డు మెంబర్లు కగ్గా శివయ్య, పెనుమాల సునంద తదితరులు పాల్గొన్నారు.

బాజీబాబా దర్గాలో అన్న సంతర్పణ

పెదకాకాని: బాజీబాబా దర్గాలో శుక్రవారం భక్తులకు అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. వారిలో కొందరు రాత్రి వేళల్లో దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేస్తారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సహకారంతో దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్న సంతర్పణ జరిగింది. దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పెదకాకాని: బైక్‌పై వెనుక కూర్చుని వెళుతున్న మహిళ మెడలో గుర్తుతెలియని వ్యక్తులు గొలుసు దొంగిలించిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. తెనాలికి చెందిన నండూరి కృష్ణ, లలిత దంపతులు బైక్‌పై పెదకాకాని శివాలయానికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతుండగా గురువారం రాత్రి వారి బైక్ పెదకాకాని పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకునే సరికి వెనుక నుంచి బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు మెడలో బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బైక్‌పై నుంచి కిందపడిన కృష్ణ దంపతులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది, అనంతరం పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

జీజీహెచ్ ఓపీలో వాటర్ కూలర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఓపీ విభాగం వద్ద గుంటూరు శ్రీనగర్‌కు చెందిన పట్టపు గోపి ఆర్థిక సాయంతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. పట్టపు బసవప్పన్నయ్య జ్ఞాపకార్థం రూ. 50 వేలతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేసినట్లు గోపి తెలిపారు.

సేవా వారధులుగా వలంటీర్లు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- వెంగళాయపాలెం గ్రామంలో వలంటీర్లకు అవార్డుల ప్రదానం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనలో సేవా వారధులుగా వలంటీర్లు నిలుస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెం, ఓబులునాయుడుపాలెం గ్రామాలకు చెందిన వలంటీర్లకు సేవా పురస్కారాలను వెంగళాయపాలెం గ్రామ సచివాలయం వద్ద సభలో అందజేశారు. జగనన్న ప్రవేశ పెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ఇంటికి చేర్చి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా కృషిచేస్తున్న వలంటీర్లను సుచరిత అభినందించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తూ తమ వంతు కృషిచేస్తున్న వలంటీర్లకు జగనన్న అందిస్తున్న సేవా పురస్కారాలను అందించటం సంతోషకరమన్నారు. సేవా వజ్ర 2, సేవా రత్న 1, సేవా మిత్ర 43 పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రతి వలంటీరు సేవా దృక్పథంతో ఇదే విధంగా ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కారం దిశగా కృషిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో పథకాలు ఒక వర్గానికి మాత్రమే అందేవన్నారు. కానీ నేడు పార్టీలకతీతంగా కుల, మతం చూడకుండా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ పిల్లి మేరి, ఎంపీటీసీ రమేష్, భూలక్ష్మి, ఇంచార్జ్ ఎంపీడీవో శోభరాణి, లలితకుమారి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు మెట్టు వెంకటప్పారెడ్డి, వెంకటరావు, అబ్దుల్ నబీ, పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామ సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

కొప్పురావూరు(పెదకాకాని): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండలం కొప్పురావూరులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలసి ప్రతి ఇంటికీ తిరిగి, సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కరపత్రాలు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా మంచి పరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కొప్పురావూరు గ్రామంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకు గడప గడపలోనూ ఘన స్వాగతం లభించింది. ముందుగా శ్రీరాములమ్మ అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పంచాయతీ నిధులతో సీసీ రోడ్డుకు శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, సర్పంచి ఆలా సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, వ్యవసాయ పరపతి సంఘం చైర్‌పర్సన్ తోట శ్రీనివాసరావు, మాద రాధా, స్థానిక నాయకులు చిల్లా వెంకటేశ్వరరావు, పరకండ్ల నాగేశ్వరరావు, తిరుమలశెట్టి పాలోచన, రాజశేఖర్, కామినేని మోహనరావు, యర్రంశెట్టి తులసీరామయ్య, ఏనుగుల శ్రీనివాసరావు, నందిగం పృథ్వి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నివాసాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: అభ్యంతరం కాని ఆక్రమిత ప్రభుత్వ భూముల్లోని ఆవాస స్థలాల క్రమబద్ధీకరణకు ప్రజల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సంజీవకుమారి తెలిపారు. బీఎస్‌ఓ 21, 26కి అనుగుణంగా 2019 అక్టోబరు 15వ తేదీ నాటికి గానీ, అంతకు పూర్వం గానీ అనధికారికంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వ్యక్తులు తమ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆక్రమిత ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోదలచిన వారు డిసెంబరు నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరించుకోవాలనుకునే వారు తమ ఆధీనంలో ఉన్న భూములకు నిర్ణీత రుసుమును చెల్లించాలన్నారు. వారు నివసిస్తున్న గృహాలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ఇంటి నిర్మాణ అనుమతిపత్రం, కుళాయి పన్ను రసీదు, ఇతర ఆధారాలతో గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సంజీవకుమారి కోరారు. మరిన్ని వివరాలను ఆయా గ్రామాల్లోని వీఆర్వోలు, లేదా మండల తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పేదలకు మంచి జరిగితే బాబు ఓర్వలేరు..

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చేబ్రోలు: పేద, బడుగు, బలహీన వర్గాలకు మంచి జరిగితే టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓర్వలేకపోతున్నారని వైఎస్సార్ సీపీ మండల నాయకులు విమర్శించారు. చేబ్రోలులోని పార్టీ కార్యాలయం ఎదురుగా జీబీసీ రహదారిపై శుక్రవారం చంద్రబాబు నాయుడి దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. ప్రభుత్వం పేదలకు రాజధాని ప్రాంతంలో ఇచ్చిన సెంటు స్థలం శవాన్ని పూడ్చిపెట్టడానికి సరిపోతుందని చంద్రబాబు విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబ శివరావు, కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, కాసు ఈశ్వరరెడ్డి మాట్లాడారు. అమరావతిలో పేదలకు ఇళ్లు ఇవ్వకుండా అడ్డుకోవడానికి చంద్రబాబు ప్రోద్బలంతోనే కొందరు పెత్తందారులు కోర్టుల్లో కేసులు వేశారని, సుప్రీం కోర్టు తీర్పు టీడీపీ నేతలకు చెంపపెట్టుగా మారిందన్నారు. అమరావతిలో పేదలకు ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లపై చంద్రబాబు అహంకారపూరితంగా పెందుర్తి రోడ్ షోలో విమర్శలు చేయడం పేదలను అవమానించడమేనని మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేబ్రోలు మండలంలో పేదలకు సెంటు భూమి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. నారాకోడూరు ప్రాంతానికి చెందిన 27మంది బాబు సామాజిక వర్గానికి చెందిన వారు రాజధాని ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షపాతిగానే ఉంటుందని, పేదలకు మరింత మంచి చేయడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడుని పేద ప్రజలు రోడ్డు మీద కూడా తిరగకుండా చేసే రోజులు ముందున్నాయని హెచ్చరించారు. ఎస్.వెంకటరెడ్డి, నాగబాబు, శివన్నారాయణ, వీరభద్రయ్య, చినబాబు, పెద మస్తాన్, బాలచంద్రయ్య, పచ్చిగళ్ల సుబ్బారావు, పోతురాజు, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొక్లెయినర్, లారీ సీజ్



నడింపాలెం (ప్రత్తిపాడు): అక్రమ మైనింగ్ తవ్వకాలకు వినియోగిస్తున్న ప్రొక్లెయినర్, లారీలను సీజ్ చేసినట్లు ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు. మండల పరిధిలోని నడింపాలెంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం శుక్రవారం తనకు అందిందని తెలిపారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు జరుగుతున్న ప్రదేశంలో ఉన్న ప్రొక్లెయినర్‌తో పాటు లారీని సీజ్ చేసినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి, వాహనాలను మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తులు నగలు దోచుకుని వెళ్లిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవాపురం రెండో లైనులో నివసించే వి.నాగమణి గురువారం ఇంటి వెనుక తలుపు గడియపెట్టి దూరంగా ఉన్న బాత్‌రూములో స్నానానికి వెళ్లింది. బాత్‌రూములో నుంచి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా, టేబులుపై పెట్టిన నల్లపూసల బంగారం గొలుసు, బంగారం నాన్‌తాడు చోరీకి గురైనట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ మాట్లాడుతూ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి స్వర్ణ రామారావు ఈనెల 16వ తేదీన అరండల్‌పేట 6వలైనులో ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి లోపలకు వెళ్లి బయటకు రాగా ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి స్తంభాలగరువు 8వ లైనులో నివశించే నడ్డి మనోజ్‌గా ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్న విషయాన్ని తెలుసుకుని శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ హైమారావు మాట్లాడుతూ ద్విచక్రవాహనాలకు రెండో తాళం ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్కింగ్ చేసిన సమయంలో తప్పకుండా తాళం వేయాలన్నారు. పలు ద్విచక్రవాహనాల చోరీ ఘటనలో తాళాలు అరిగిపోయి ఉండటం, వాహనదారుడు వాహనానికి తాళాలు లేకుండా లోపలకు వెళ్లడం వల్ల చోరీలు జరుగుతున్నాయన్నారు.

సమన్వయంతో రహదారులు విస్తరించండి

- ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలి
- నగర కమిషనర్ చేకూరి కీర్తి ఆదేశం



పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి

నెహ్రూ నగర్ (గుంటూరు తూర్పు): నగరంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ పనులు ఎక్కువ కాలం సాగితే ప్రజలు ఇబ్బందులకు గురి అవుతారని, ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. విస్తరణ జరిగిన ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేయాల్సిన టీడీఆర్ బాండ్లు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏటీ అగ్రహారం పనులు వేగంగా జరగాలని, విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. బకాయిలు చెల్లించకుండా మీడియా సంస్థలు బోర్డ్‌ల మీద యాడ్స్ పబ్లిష్ చేసుకుంటున్నారని, వచ్చే వారం రోజుల్లో డిస్‌ప్లే ఫీజులు రూ.కోటి వసూళ్లు లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ చేపట్టాలని, బకాయిలు చెల్లించని బోర్డ్ లను వెంటనే తొలగించాలని సిటి ప్లానర్ కు స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లకు ప్రణాళిక అధికారులకు రోజువారి లక్ష్యాన్ని కేటాయించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిర్మాణదారులు ఇష్టానుసారం రోడ్ల మీద వేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి వారి నుంచి అపరాధ రుసుం వసూళ్లు చేసి, వ్యర్థాలను తొలగించాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. రీ సర్వే వేగవంతం చేయాలని, కోర్ట్ కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, కంటేమ్ట్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేసుల వారీగా ప్రతి వారం సిటీ ప్లానర్ సమీక్ష చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటి ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు బాబురావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ లు, ఏఈ పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను వేధిస్తున్న భర్తపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చుట్టుగుంటకు చెందిన అమర్తలూరి వెంకటేశ్వరరావు, గీతికలకు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. వెంకటేశ్వరరావు తరచూ వేధిస్తున్నాడని గీతిక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

టీడీపీ సర్పంచ్‌పై వైసీపీ సర్పంచ్, నాయకుల ఫైర్



టీడీపీ సర్పంచ్ మాటలను ఖండిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ సర్పంచ్ లక్ష్మారెడ్డి

ప్రత్తిపాడు: ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లను నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని టీడీపీ సర్పంచ్‌పై, వైఎస్సార్ సీపీ సర్పంచ్‌తో పాటు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిక్కిరెడ్డిపాలెం తెలుగు దేశం సర్పంచ్ మాకినేని జగన్ వలంటీర్లు పింఛన్ ఇవ్వడానికి తప్ప ఎందుకూ పనికిరారని, వాళ్ల వల్ల ఉపయోగం ఉండటం లేదంటూ.. కించపరిచేలా మాట్లాడారు. దీంతో ఆగ్రహానికి గురైన కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి.. టీడీపీ సర్పంచ్‌పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వలంటీర్లు గ్రామాల్లో నిస్వార్థంగా పనిచేస్తున్నారని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉన్న వారిని అవమానించేలా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. పనిచేయని ఒకరిద్దరుంటే.. వారు ఎవరో చెప్పాలి గానీ, అందరినీ దూషించడం సరికాదన్నారు. జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఓంప్రకాష్ రెడ్డిలు టీడీపీ సర్పంచ్ జగన్‌మోహన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామాల్లో జరుగుతున్నా కనీసం ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఎందుకు సమాచారం ఇవ్వరని జెడ్పీటీసీ.. వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్‌ను ప్రశ్నించారు. నకిలీ పురుగు మందులు రాకుండా చూడాలని సర్పంచ్ లక్ష్మారెడ్డి ఏవోను కోరారు. విద్యుత్‌శాఖ అధికారులపై కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు మండిపడ్డారు. అర్ధరాత్రి వేళ ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, ఫోన్లు చేస్తే తియ్యరని, ప్రజలు తనను నిద్ర పోనివ్వడం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నమ్మ, ఎంపీడీవో శ్రీరమ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్
- ఆకస్మికంగా వేసవి శిక్షణ శిబిరాల తనిఖీ



పఠనంపై పరిశీలిస్తున్న జిల్లా చైర్మన్ దేవానంద్

పెదనందిపాడు/ప్రత్తిపాడు/గుంటూరు రూరల్/కాకుమాను: విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా ఉపయోగపడుతున్నాయని, వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ ఏటుకూరు శాఖ గ్రంథాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 8 నుంచి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను దేవానంద్ పరిశీలించారు. శిబిరంలోని అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 98 శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు పి.సుభాషిణి, బి.అరుణ, వి.పరమేశ్వరి, జోగి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం పక్షపాతి సీఎం వైఎస్ జగన్



నంబూరు మసీదు మద్ద సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న ముస్లింలు

పెదకాకాని: ముస్లిం మైనార్టీల పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొకసారి రుజువు చేసుకున్నారని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని అన్నారు. నంబూరు గ్రామంలో జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యులు సయ్యద్ సుభాని ఆధ్వర్యంలో చిన్న మసీదు జమాతుల వారితో కలిసి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సుభాని మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 1,813 మంది హజ్ యాత్రకు బయలు దేరుతున్నారని, విజయవాడ నుంచి వెళ్లే వారికి ఈ ఏడాది అదనంగా రూ. 80,000లు భారం పడుతోందన్నారు. ఈ అదనపు భారాన్ని భరిస్తూ.. మైనార్టీ వెల్ఫేర్ బడ్జెట్ ద్వారా రూ.14,51,20,000లను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఎండీ అలీ, ఎండీ బురహానుద్దీన్, ఇమామ్ షహబుద్దీన్, ఇర్ షాద్ అలీ, సయ్యద్ రబ్బాని, సయ్యద్ అలి, మహబూబ్ బాషా, సయ్యద్ ఖాశీం, సైదుసన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కరిముల్లా బాబా ఉరుసు మహోత్సవం



శోభాయమానంగా కరిముల్లా షా ఖాదరి నిషాని

పెదకాకాని: కరిముల్లా షా ఖాదరి నిషాని ఉరుసు గంధ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 14వ ఉరుసు గంధ మహోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మూడు రోజుల ఉరుసు మహోత్సవంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం రాత్రి 10 గంటలకు కరిముల్లా షా ఖాదరి నిషాని ధర్మకర్త పఠాన్ మాబు సుబాని ఇంటి వద్ద నుంచి గంధం, గుబ్బం బయలు దేరింది. ఈ ఉరుసు వేడుకలను పురస్కరించుకుని కరిముల్లా షా ఖాదరి నిషాని గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో దర్గా ప్రాంగణం అంతటా కళకళలాడింది అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కరిముల్లా షా ఖాదరి నిషాని చుట్టూ ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మకర్త పఠాన్ మాహబూబ్ సుబాని ఆధ్వర్యంలో భక్తుడు షేక్ ఆసిఫ్ సహకారంతో ఉరుసు మహోత్సవం మూడు రోజులూ భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. పెదకాకాని దర్గా నుంచి మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, క్రాకర్స్ కాంతుల మధ్య గంధం, గుర్రం గ్రామోత్సవం జరిగింది. శనివారం ఉదయం 11 గంటలకు కరిముల్లా షా ఖాదరి బాబా వారి నిషానికు చేరుకుని, బాబా వారి సలామి, ఖురాన్ చదివడం అనంతరం భక్తులకు బాబా వారి గంధం పంపిణీ చేయడం జరుగుతుందని ధర్మకర్త మాబు సుబాని తెలిపారు. భక్తులందరికీ అన్న సంతర్పణ జరిగింది.

సీనియార్టీ జాబితాను రూపొందించాలి



డీఈవో శైలజకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను మెరిట్ కం రోస్టర్ విధానంలో రూపొందించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో పి.శైలజను కలిసిన ఎస్టీయూ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేరా మోహనరావు, చందా నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగోన్నతులను ఎటువంటి ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నాయకులు డి. పెదబాబు, డీఏ జోసఫ్, షేక్ బాజీ, సీహెచ్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

అన్నెం వెంకట కృష్ణారెడ్డి

[illegible] 9885961597

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com